శంకుస్థాపనలకే పరిమితం

- శిథిలావస్థలో జీపీ భవనాలు
- భయంభయంగా విధుల నిర్వహణ
- కొన్ని గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణానికి రెండుసార్లు భూమిపూజ

శంకరపట్నం: మండలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం శంకుస్థాపనలకే పరిమితమైంది. మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో ఇద్దరు సర్పంచుల పదవీకాలం ముగిసేముందు నూతన గ్రామ పంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేయడం విశేషం. మొలంగూర్ గ్రామంలో ఐదేళ్లలో రెండుసార్లు భూమిపూజ చేశారు. మెట్‌పల్లి రాజాపూర్ తదితర గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలకు ఉపాధి హామీ పథకం కింద ఒక్కోదానికి రూ.20 లక్షల నిధులు కేటాయించారు. ఇటీవల ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారు. మెట్టుపల్లి గ్రామంలో బేస్‌మెంట్ వరకు పనులు చేపట్టారు. అంబాల్‌పూర్‌లో మూడు నెలల క్రితం ఎమ్మెల్యే రసమయి శంకుస్థాపన చేయగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గుంతలు తీసి వదిలేశాడు. మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ భవనాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించకపోవడంతో అధికారులు మార్కింగ్ చేయలేదు. గతంలో కేశవపట్నం కరీంపేట, ఆముదాలపల్లి గ్రామాల్లో మాత్రమే గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశారు. లింగాపూర్, రాజాపూర్ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గ్రామాల్లో పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు నిర్మాణం పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. మక్త, కల్వల గొల్లపల్లి, చింతగుట్ట నూతన గ్రామ పంచాయతీలుగా ఐదేళ్ల క్రితం ఏర్పడ్డాయి. మక్త గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతోంది. కల్వల, గొల్లపల్లి, చింతగుట్ట గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాలకు నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వ స్థలాల ఎంపిక చేయకపోవడంతో పనులు జరగడం లేదు.



అంబాల్‌పూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

పనులు పూర్తిచేయాలి



అంబాల్‌పూర్‌లో ఇద్దరు సర్పంచుల హయాంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మిస్తామని శంకుస్థాపనలు చేశారు. గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ప్రజలు పని నిమిత్తం జీపీకి వస్తే పెచ్చులు ఊడిపడుతున్నాయని భయపడుతున్నారు. శంకుస్థాపన చేసిన అధికారులు స్పందించి నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి.

– తుమ్మేటి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్

రెండుసార్లు శంకుస్థాపన



బాల్పూర్‌లో జీపీ భవనం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిన అధికారులు ఐదేళ్లలో రెండుసార్లు శంకుస్థాపనలు చేయించి్రు పనులు మాత్రం చేపట్టడం లేదు. శిథిలావస్థలోని పంచాయతీ భవనంలో విధులు కొనసాగిస్తున్నారు. జీపీ భవనం ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. వెంటనే గ్రామ పంచాయతీ భవనం పనులుచేపట్టాలి.

– సరేశ్, అంబాల్‌పూర్

పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం

మండలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. మండలంలోని కొన్ని గ్రామాల్లో స్థలాలు కేటాయించకపోవడంతో మార్కింగ్ చేయలేదు. కేటాయించిన గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి.

– తిరుపతి, ఏఈ

క్లుప్తంగా

కురుమ యువజన, ఉద్యోగ సంఘాల కార్యవర్గం

గంగాధర: చొప్పదండి నియోజకవర్గస్థాయి కురుమ యువజన, ఉద్యోగ సంఘాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నామని కురుమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఒగ్గు మల్లేశం ప్రకటనలో తెలిపారు. యూత్ అధ్యక్ష, కార్యదర్శులుగా కడారి కుమారస్వామి, అమరకొండ రాజేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యముండ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పబ్బల్ల అయిలయ్య, సంయుక్త కార్యదర్శిగా కెంద హనుమాన్, కోశాధికారిగా దయ్యాల తిరుపతిని ఎన్నుకున్నారు. ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా ఈర్ల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా సంబ కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా గుంటి రవీందర్, సంయుక్త కార్యదర్శిగా ఎముండ్ల సతీశ్, సహాయ కార్యదర్శిగా పెద్ది రాజమల్లు, కోశాధికారి జడ కమలాకర్, కార్యవర్గ సభ్యులుగా కుమార్,గుంటి సంపత్,బండారి అశోక్, ఐలయ్య ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

సమస్యలు తెలుసుకున్న మాజీ ఎంపీ

సైదాపూర్: మండల కేంద్రంలోని పలు వీధుల్లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. కూరగాయల మార్కెట్, హోటళ్లు, రద్దీగా ఉండే ఏరియాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, గుండారం శ్రీనివాస్, ఎంపీటీసీలు చైతన్యకొండారెడ్డి, చాంద్‌పాషా, దాసరి అరుణమల్లయ్య, నాదేండ్ల రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రలోభాలను అరికట్టాలి..

వీణవంక: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రలోభాలను అరికట్టాలని కోరుతూ వీణవంక బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవోలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి పక్షపాతం లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాగు అశోక్‌రెడ్డి, మద్దుల ప్రశాంత్, దూలం సురేశ్, కర్రె నాని, విష్ణు, రవీందర్, రాజబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త

హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఓటరు నమోదులో తప్పులు దొర్లాయని, వెంటనే సవరించాలని కోరుతూ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు మంగళవారం సామాజిక కార్యకర్త నలబాల వేణుగోపాల్ వినతిపత్రం అందజేశారు.

తాటి విత్తనాలు నాటిన గీతకార్మికులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలోని తాటివనంలో మంగళవారం బీహార్ రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన పొట్టిరకం తాటి చెట్టు విత్తనాలను గీతకార్మికులు నాటారు. ఈ తాటిచెట్టు ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాల్లో కల్లు పారుతుందని, కేవలం పది అడుగుల ఎత్తు మాత్రమే ఉంటుందని ఉప సర్పంచ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, ప్రతినిధులు బుర్ర మల్లేశం, బాబు, చంద్రయ్య, సంజీవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేసిన సొసైటీ సభ్యులు

మానకొండూర్: మండల కేంద్రంలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు నాలుగు రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ డైరెక్టర్ సిస్టర్ ప్రీతా మాట్లాడుతూ... సేంద్రియ ఎరువులతో పండ్ల మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో దీప్తి, అరుణ, మల్లేశం, రమేశ్, రూప, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'కొత్తవాళ్లకు టికెట్ ఇవ్వొద్దు'

మానకొండూర్: బీజేపీ నుంచి మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కొత్తవాళ్లకు ఇవ్వొద్దని పార్టీ జెండా మోసిన స్థానికులకే ఇవ్వాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, రాపాక ప్రవీణ్, నగునూరి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తాము పార్టీ జెండా మోశామని, వివిధ కార్యక్రమాలు చేపట్టామని, ఆయా కుల సంఘాల్లో పనిచేశామన్నారు. పార్టీలో పనిచేసే వారిని కాకుండా కొత్త వారిని గుర్తించి టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. కొత్తవారికి టికెట్ ఇస్తే పార్టీని పట్టుకున్న వాళ్లకు పదవులు, టికెట్ రాదనే ఇండికేషన్ వెళ్తుందన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పార్టీని ముందుకు నడిపిస్తున్న మా నలుగురిలో ఎవరికైన టికెట్ కేటాయిస్తే మానకొండూర్‌లో బీజేపీ గెలిపించుకుంటామన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

హుజూరాబాద్: పోస్టల్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పెద్దపల్లి తపాలాశాఖ సూపరింటెండెంట్ పి. ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సిటీ సెంటర్ ఫంక్షన్ హాల్‌లో జాతీయ తపాలా దినోత్సవాలు నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని, కేవలం ఉత్తరాల బట్వాడా వరకే పరిమితమైన తపాలాశాఖ ఇప్పుడు బ్యాంకింగ్, బీమా, ప్రావిడెంట్ ఫండ్, జాతీయ, అంతర్జాతీయ పార్సిల్, పింఛన్, ఆధార్ నమోదు, రైల్వే రిజర్వేషన్ తదితర సదుపాయాలను ప్రజల ముంగిటకు తెచ్చిందన్నారు. ఖాతాదారులు పోస్టాఫీసుకు రాకుండా ఇంటి నుంచే సేవలు పొందే అవకాశాలను కల్పించిందని, మహిళలు, రైతులు, బాలికలు, వృద్ధులకు ఉపయోగపడే బహుళ పథకాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్, ఎస్పీ సునీల్, జమ్మికుంట ఐపీ మోహన్, హెడ్ పోస్ట్ మాస్టర్ ఊకంటి మహేందర్, జమ్మికుంట, హుజూరాబాద్ సబ్ డివిజన్ తపాలాల ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రభాకర్

డీటీఎఫ్ మహాసభలకు తరలిరావాలి



గంగాధర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగాధర: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర విద్యా మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు తరలి రావాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంకణాల కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మాట్లాడారు. అనంతరం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. డీటీఎఫ్ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 15 నుంచి 17వ తేదీ వరకు మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సయ్య, రాజేందర్, ఎం .శ్రీనివాస్, రవీందర్‌కుమార్, జగదీశ్వర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి'

విద్యానగర్(కరీంనగర్): అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కరీంనగర్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కెళిపెద్ది శ్రీధర్‌రాజు, కన్వీనర్ మియాపురం రవీంద్రాచారి, నాయకులు నర్సింగోజు శ్రీనివాస్, బత్తుల మల్లేశం, లింగం పల్లి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అధిక శాతం బీసీ ఓటర్లు ఉన్నారని బీసీల ప్రాధాన్యతను గుర్తించి బీసీలకు పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు.

పాస్టర్స్ కార్యవర్గం



ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి పిట్టలవాడలోని జెరూసలెమ్ ప్రేయర్ చర్చిలో న్యూ విజన్ పాస్టర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరికిల్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జ్యోతిబాబు, కార్యదర్శిగా జాన్‌ప్రసాద్, ఉపకార్యదర్శిగా సిమోన్ బాబు, ట్రెజరర్‌గా పీటర్, జాయింట్ ట్రెజరర్‌గా మార్క్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాస్టర్స్, సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

చొప్పదండి: టీటీడీపీ చొప్పదండి పట్టణ అధ్యక్షుడిగా పిట్టల సాగర్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి జంగం అంజయ్య తెలిపారు. అన్ని వార్డుల్లో కమిటీలు వేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీటీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

కుమ్మరి సంఘం కార్యవర్గం



గన్నేరువరం: గన్నేరువరం మండలం కుమ్మరి సంఘం అడహక్ కమిటీని మంగళవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా విలాసాగరం రామచంద్రం, అధ్యక్షుడిగా విలాసాగరం తిరుపతి, కార్యదర్శిగా నాగపూరి వెంకటేశ్, కోశాధికారిగా గంగాధర మహేందర్, ఉపాధ్యక్షులుగా రాపోలు రాజేశం, రుద్రారం ఆగయ్య, విలాసాగరం రాజమల్లు, కార్యదర్శిగా ఎలగందుల తిరుపతి, ప్రచార కార్యదర్శిగా విలాసాగరం మల్లేశం, సభ్యులు ఎన్నికయ్యారు.

అందరి సంక్షేమానికి ఆరు గ్యారెంటీ పథకాలు

గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లె, పీచుపల్లి గ్రామాల్లో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ప్రచారం చేశారు. పలువురు యువకులు, నాయకులు, మహిళలు పార్టీలో చేరారు. పేదలు, రైతులు, యువకుల సంక్షేమానికి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చాకలివానిపల్లెలో గ్రామశాఖ అధ్యక్షుడు బామండ్ల విద్యాసాగర్, నక్క మహేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు అనిల్, మల్లేశం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, మల్లారెడ్డి, రాజిరెడ్డి, స్వామి, సత్తయ్య సంపత్, బాలయ్య, శ్రీధర్‌రెడ్డి, అజయ్‌కుమార్, కొమురయ్య, పర్శ రాములు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.



చాకలివానిపల్లెలో కవ్వంపల్లి ప్రచారం

మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం



గట్టు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా గట్టు శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా బొల్లి రాజయ్య, కార్యదర్శిగా కూన ముత్తయ్య ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కర్ణన్‌కుమార్ తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సహకార సంఘం సభ్యులను జెడ్పీటీసీ గీకురు రవీందర్ అభినందించి శాలువాలు కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు కూన వెంకటేశం, కన్నం కనకయ్య, కూన బాలయ్య, సంపత్‌కుమార్, గట్టు బాబు, బరిగెల లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు



చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పరిధి లాలయ్యపల్లె ఎస్సీ కాలనీ క్రాసింగ్ వద్ద మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతో మంచినీరు వృథాగా పోతోంది. కొన్ని నెలలు గడిచినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని ఇకనైనా పైపులైన్‌కు మరమ్మతు చేయాలని లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కుప్పలతో తప్పని తిప్పలు

- రోడ్డు విస్తరణ చేసినా ప్రయోజనం శూన్యం
- పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

చొప్పదండి: పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో నిబంధనలు పాటించకపోవడంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. రూ.33 కోట్లతో చేపట్టిన పనుల్లో నాణ్యతపై ఇంతకు ముందే ఆరోపణలు రాగా ఇప్పుడు పనులు ఇష్టారాజ్యంగా చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటులో భాగంగా ఇరువైపులా యాభై అడుగుల చొప్పున రోడ్డు విస్తరణ చేసి డ్రైనేజీలు నిర్మించారు. డ్రైనేజీల పక్కన మట్టిపోయకపోవడం, రోడ్డు విస్తరణ చేసిన స్థలంలోనే మొరం కుప్పలు ఉండటంతో ఇప్పుడు ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది.

డివైడర్ నిర్మాణంతో సమస్య

డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యే దశలో ప్రస్తుతం డివైడర్ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో పనులు నడుస్తున్న సమయంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. వాహనాలు ఒక వైపు నుంచి వెళ్తుండటంతో తారురోడ్డు కింద ఉన్న కుప్పల మూలంగా వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఇరుక్కుపోతున్నాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి మార్కెట్ చౌరస్తా వరకు వెడల్పు చేసిన రోడ్డుపైనే మళ్లీ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. దీంతో మట్టి రోడ్డు మెరుగు కాకపోవడం, రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. రోడ్డు నిర్మాణం నిబంధనల మేరకు జరిగేలా అధికారులు చూడాలని, డివైడర్ నుంచి డ్రైనేజీ వరకు తారురోడ్డుతో పాటు, మట్టి రోడ్డును ప్రయాణానికి అనుకూలంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పేరుకుపోయిన మట్టికుప్పలు

'వాగేశ్వరి'లో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం

తిమ్మాపూర్: అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చెలిమెడ ఆనందరావు వైద్య బృందం మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజమౌళి, సైక్రియాట్రి విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్, తదితర వైద్యబృందం మాట్లాడుతూ శరీర ఆరోగ్యం లాగానే మానసిక ఆరోగ్యాలను కాపాడుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో వాగేశ్వరి కళాశాల ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌వోడీ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అతిథులు